www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 19 జూన్ 2025
5
తిరుపతి

ఎస్‌వి ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల

హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీనివాస అనిదృత్ బుధవారం టిటిడి శ్రీ వెంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు ఆయన తరపున ఆయన ప్రతినిధి వై.రాఘవేంద్ర తిరుమలలోని టిటిడి అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.



- ఆర్‌బికెల్లో యూరియా నిల్వలు నిల్ ● అన్నదాతలను పీడిస్తున్న కొరత

ప్రజాశక్తి - ఏర్పేడు

ఈ ఏడాది విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడం, ముందుగానే రుతుపవనాలు ప్రవేశించడంతో అన్నదాతలు సంతోషంతో మే 15 నుంచే దుక్కులు దున్నడం ప్రారంభించారు. పంట ఏపుగా పెరిగేందుకు నత్రజని కీలక పాత్ర పోషిస్తుంది. అందుకోసం యూరియా వినియోగం తప్పనిసరి. ఈ కారణంగానే యూరియాకు డిమాండ్ అధికం. గత ఖరీఫ్ సీజన్లో అధిక ఉష్ణోగ్రతల వలన నీటి ఎద్దడి ఏర్పడడంతో రైతులు పంటలు వేయడానికి అంతగా మొగ్గు చూపలేదు. నైరుతి రుతు పవనాలు చాలా ఏళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలోనే రావడం వలన పంట సాగుకు నీటి ఎద్దడి నుండి రైతులు ఉపశమనం పొందుతున్న తరుణంలో అన్నదాతలు ఉత్సాహంగా పలు గ్రామాలలో సగం మంది రైతులు మే నెల ఆఖరిలోపే నాట్లు వేశారు.

ఏర్పేడు మండలంలో 19 సచివాలయాలకు గాను 17 రైతు భరోసా కేంద్రాలు (ఆర్బి కే సెంటర్స్) ఉన్నప్పటికీ యూరియా నిల్వలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏర్పేడు, పాపా నాయుడుపేట, పల్లాం ప్రాంతాలలో ఎరువుల విక్రయాల ఏజెన్సీలు ఉన్నా కావలసినంత యూరియాను రైతు సోదరులకు అందించడం లేదని వాపోతున్నారు. ఎందుకు తెప్పించటం లేదని ఏజెన్సులను ప్రశ్నించగా రవాణా చార్జీలు అధికంగా ఉన్నాయని యజమానులు కుంటి సాకులు చెబుతున్నారని రైతులు మండిపడుతున్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు తగిన రీతిలో ఎరువును అందించక పోవడంతో దీనిని అదునుగా తీసుకొని కొందరు ప్రైవేట్ ఎరువుల విక్రయదారులు మార్కెట్ రేటు కంటే అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. బస్తా యూరియా రూ.286 నుంచి 300 వరకూ విక్రయిస్తున్నారు.

నగదు చెల్లించి ముందుగా నమోదు చేసుకోవాలి

గతంలో కొంతమేర యూరియాను రైతు భరోసా కేంద్రాలకు తెప్పించి ఆయా పరిధిలోని రైతులకు సమాచారాన్ని అందించడంతో రైతులు నగదు చెల్లించిన తర్వాత విక్రయాలు చేపట్టేవారు.ప్రస్తుతం ఆ పద్ధతికి వ్యతిరేకంగా ముందస్తుగా రైతు భరోసా కేంద్రాలలో రైతులు నగదు చెల్లించి నమోదు చేసుకుంటేనే వారం పది రోజుల

తర్వాత యూరియాను తెప్పించి రైతులకు అందజేస్తున్నారు. ఈ సమస్య వలన రైతులు యూరియా కొరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. రైతులు ఎదురు చూడలేక ప్రైవేటు ఏజెన్సీల వద్దకు వెళ్లినా యూరియా దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర ఎరువులు కొనాల్సిందే : శివ, రైతు, అముదూరు

రైతు భరోసా కేంద్రాలలో యూరియా ముందుగా తెప్పించట్లేదు. ఒకవేళ యూరియా కావాలంటే ముందుగా నగదు చెల్లించి బుక్ చేసుకోవాలి. ఒక లారీ లోడ్ యూరియాని రైతులంతా కలిసి బుక్ చేసుకుంటే ఎప్పటికో తెప్పిస్తున్నారు. అవసరానికి ఉపయోగపడట్లేదు. సరేలే అనీ ఎరువుల దుకాణాలకెళితే నీకు యూరియా కావాలంటే భాస్వరం ఎరువుల గాని, పురుగు మందులు గాని కొంటేనే ఇవ్వగలమని నిర్మొహమాటంగా ఏజెన్సీ యజమానులు చెబుతున్నారు.

సకాలంలో వేయాలి : మహేష్, రైతు, ఎండి పుత్తూరు

నేను ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి నాటాను. మొదటిదఫా ఎరువులు వేయాల్సి ఉంది. ఎకరాకు ఒక బస్తా చొప్పున ఐదు ఎకరాలకు ఐదు బస్తాల యూరియా కావాలి. రైతు భరోసా కేంద్రానికి వెళితే ఆలస్యం అవుతుందన్నారు. ఏజెన్సీల వద్దకు వెళితే వేరే మందులు కొనాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లోనూ ఇదే పరిస్థితి.

రైతు భరోసా కేంద్రాల్లో రూ.268కే ఇస్తున్నాం : బి.సాగరిక, ఏర్పేడు మండల వ్యవసాయ అధికారి

కిందటి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో పంట వేశారు. రబీలో 9,700 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఆరువేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఒక బస్తా కోరమాండల్ యూరియారూ.268 చొప్పున ఇస్తున్నాం.

అమ్మకానికి మున్సిపల్ స్థలాల ప్రతిపాదన
కౌన్సిల్ రసాభాస

"వ్యతిరేకించిన మెజార్టీ కార్పొరేటర్లు
అనుకూలంగా ఇద్దరు డిప్యూటీ మేయర్లు
కమిటీ ఏర్పాటుకు ఎంఎల్‌ఎ సూచన
భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు"

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించి వాటితో వచ్చిన డబ్బులతో సిఎస్‌సి (కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నిర్మాణానికి) వెచ్చించాలి' అని కౌన్సిల్లో 71వ అజెండాలో పొందుపరిచారు. అయితే మేయర్ సహా మెజార్టీ కార్పొరేటర్లు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. అయితే కూటమికి సంబంధించిన డిప్యూటీ మేయర్లు ఇద్దరూ అమ్మాల్సిందేనని పట్టుబట్టారు. అయితే మెజార్టీ కార్పొరేటర్లు వ్యతిరేకించడంతో కమిటీ ఏర్పాటుకు ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఎస్వీసెనెట్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం భారీ పోలీసు బందోబస్తు నడుమ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని అమ్మేసి వాటి ద్వారా వచ్చిన డబ్బులతో కొత్త కార్యాలయం నిర్మాణం చేయవద్దని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని, కార్పొరేషన్ స్థలాన్ని పరిరక్షించి అవసరమైతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తెచ్చుకొని, కొత్త కార్పొరేషన్ కార్యాలయాన్ని నిర్మించాలని మెజార్టీ కార్పొరేటర్లతో పాటు మేయర్ డాక్టర్ శిరీష డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్ సి మునికృష్ణ మాత్రం ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలో 39 అంకణాలు కలిగి ఉన్న స్థలాన్ని అమ్మేసి వాటి ద్వారా కొత్త కార్పొరేషన్ నిర్మాణానికి ఖర్చు చేయాలని పట్టు పట్టారు. ప్రస్తుత కార్పొరేషన్ డి మెచ్యూర్ మలేరియా విభాగానికి చెందిందని, అక్కడ కార్పొరేషన్ కార్యాలయం ఉండడం మంచిది కాదని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ పథకంలో నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఇచ్చే పరిస్థితి లేదని, ప్రస్తుతం 75శాతం కొత్త మున్సిపల్ కార్పొరేషన్ మిగతా పనులు పూర్తి ప్రారంభించాలని కోరారు. ఇటు వైసిపి కార్పొరేటర్లుకు, అటు కూటమికి అనుకూలంగా ఉండే కొంతమంది కార్పొరేటర్లు మధ్య కౌన్సిల్ సమావేశం రసాభసగా మారింది. మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో 83 అంశాలు పొందుపరిచారు. అందులో ప్రధానమైనది ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపం వద్ద ఉన్న స్థలం పై చర్చ జరిగింది. కార్పొరేటర్ నరసింహ చారి మాట్లాడుతూ కొత్త మున్సిపల్ కార్యాలయం అవసరమని, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్థలం అమ్మకానికి తాను వ్యతిరేకిస్తానని, తూకివాకం వద్ద ఉన్న 290 ఎకరాల్లో 30 ఎకరాలు అమ్మేసి కొత్త కార్పొరేషన్ నిర్మాణానికి ఖర్చు పెట్టాలని సూచించారు. వైసిపి కార్పొరేటర్లు మాత్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లేదంటే టీటీడీ నుంచి నిధులు తీసుకొని కొత్త కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. టీటీడీ ఎక్కడెక్కడో అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తోందని, తిరుపతి మున్సిపల్ కార్యాలయానికి కొంత సహాయం చేసేలా అభ్యర్థించాలని కోరారు. కార్పొరేటర్ ఎస్కే బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు సూచనలు పరిగణంలో తీసుకోవాలని కోరారు. ఏదేమైనా కమిటీ వేయాలని కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది.

కమిటీ వేద్దాం : ఎంఎల్‌ఎ ఆరణి

కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి నిధులు అవసరమని, అయితే ఈస్టు పోలీసు స్టేషన్ వద్ద ఉన్న స్థలాన్ని అమ్మాలా, లేకుంటే పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసి కొత్త కార్యాలయం నిర్మించాలా? అనే విషయమై కమిటీ వద్దామని ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు సూచించారు. 15 రోజుల్లోపు గడువు తీసుకుని కమిటీ తీసుకునే నిర్ణయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రస్తుత కార్పొరేషన్ కొత్త కార్యాలయాన్ని పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అయితే ఈ ప్రతిపాదనకూ వైసిపి కార్పొరేట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.

కౌన్సిల్‌కు హాజరైన కార్పొరేటర్లు

కార్పొరేషన్ ముందు రెండే ప్రతిపాదనలు : కమిషనర్

కొత్త కార్పొరేషన్ కార్యాలయం నిర్మాణానికి రెండే ప్రతిపాదనలు ఉన్నాయని ఒకటి ఈస్ట్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని అమ్మడి, రెండోది పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసి ఖర్చుచేయడం అని కమిషనర్ ఎన్.మౌర్య చెప్పారు. శెట్టిపల్లి భూములు తీసుకుని కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి ఖర్చు చేయవచ్చని కొంతమంది ప్రశ్నించగా అది తుడా పరిధిలో ఉందన్నారు. తూకివాకం వద్ద 290 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అన్నారు.

డిప్యూటీ మేయర్లకు అలవెన్స్ ఎలా పెంచుతారు?

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇద్దరు డిప్యూటీ మేయర్లకు నెలకు 45వేల రూపాయలు ఎలా పెంచుతారని వైసిపి కార్పొరేటర్లు తమ్ముడు గణేష్, సంధ్యారాణి అధికారులను నిలదీశారు. కార్పొరేటర్లకు నెలకు కేవలం ఆరువేలు ఇస్తున్నారని, వాలంటీర్ల జీతం తమకు ఇస్తున్నారన్నారు. మున్సిపల్ చట్టంలో డిప్యూటీ మేయర్లకు అలవెన్స్‌లు పెంచుతూ జీవో ఏమైనా ఉందా? అని కార్పొరేషన్ అధికారి శ్యాంసుందర్‌ను ప్రశ్నించారు. ఆయన సమాధానం ఇస్తూ దీనికి ప్రత్యేక జీవో ఏమీ లేదని, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు లాంటి కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ల అలవెన్స్ ప్రకారం ఇక్కడ కౌన్సిల్ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ అంశంపైనా కొంతసేపు వాగ్వాదం జరిగింది.

అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తున్న సిబ్బంది

'ప్రజాశక్తి' వార్తకు స్పందన
భవనాన్ని పడగొట్టిన ప్లానింగ్ అధికారులు

నిబంధనలు అతిక్రమించి అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని బుధవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పడగొట్టారు. నగరంలోని ఎర్రమిట్ట రాయల్ నగర్ నందు 30 అంకణాల స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు డీసీపీ ఖాన్ ఆధ్వర్యంలో ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నిర్మాణాలను తొలగించారు. మూడు అంతస్తులకు అనుమతి ఉండగా అదనంగా రెండు అంతస్తులు నిర్మించడంతో అదనపు నిర్మాణాలను బుధవారం తొలగించటం ప్రారంభించారు. గురువారం సాయంత్రానికి రెండు అంతస్తులను తొలగిస్తామని అధికారులు తెలిపారు. నగరంలో అనుమతి , ప్లాన్ లేకుండా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి మూర్తి, ప్లానింగ్ సెక్రటరీ తదితరులు ఉన్నారు.

స్థలాలను అమ్మి అభివృద్ధి ఏంటి? : సిపిఎం

తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో చాళుక్య లాడ్జి మున్సిపల్ స్థలాన్ని అమ్మాలని ప్రతిపాదన సరైనది కాదని, ఈ నిర్ణయాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందని సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. తిరుపతి స్మార్ట్‌సిటీ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.4,006 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలే తప్ప, స్థలాలను అమ్మి అభివృద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. పెండింగ్ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలన్నారు. గతంలో మాధవ్ గెస్ట్‌హౌస్ స్థలాన్ని అమ్మాలని చూసినపుడు సిపిఎం ఆధ్వర్యంలో కాపాడటం జరిగిందన్నారు. అప్పట్లో స్థలాన్ని కాపాడటం వల్లనే 'మాధవం' గెస్ట్‌హౌస్ నిర్మించారని గుర్తు చేశారు. మున్సిపల్ స్థలాల అమ్మకానికి చేసిన ప్రతిపాదనలు విరమించుకోకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

'విలీనం' నిర్ణయం మీదైతే..
'సమ్మె' మా నిర్ణయం

- 'పివిపురం' స్కూలునే మోడల్‌గా తీర్చిదిద్దాలి
- పాఠశాలల వద్ద నిరసన హోరు

పివిపురం పాఠశాల వద్ద నిరసన

ప్రజాశక్తి - రామచంద్రాపురం, కెవిబిపురం

'విలీన'ం వద్దు... మా ఊళ్లోనే మా స్కూలు ఉండాలి' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులతో నిరసనల హోరు జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై జూన్ 12న పాఠశాలలు ప్రారంభమైనా మా పిల్లలను దూరంగా ఉన్న పాఠశాలలకు పంపేది లేదు' అంటూ స్కూళ్లకు బీగాలు వేసి గ్రామస్తులు నిరసన తెలుపుతున్నారు. మా పిల్లల భద్రతే మాకు ముఖ్యం' అంటూ నినాదాలు చేస్తున్నారు.

రామచంద్రాపురం మండలం ప్రసన్న వెంకటేశ్వరపురం (పివిపురం) పరమాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలల పేరుతో విలీనం చేయొద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. పివిపురంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బలిజపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్లో విలీనం చేశారు. దీంతో రామిరెడ్డిపల్లి, ఎస్టీ కాలనీ, గంగమాంబాపురం, పివిపురం గ్రామాల నుంచి విద్యార్థులు రాష్ట్ర రహదారిపై నడచి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు ఎక్కడ ప్రమాదాలు సంభవిస్తాయోనని భయపడుతున్నారు. పివిపురంలోనే మోడల్ స్కూలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పాఠశాల స్థలం మూడు ఎకరాలు ఉందని పేర్కొన్నారు. పరమాల గ్రామంలోని పాఠశాలను కుప్పంబాదూరు మోడల్ పాఠశాలలో విలీనం చేశారు. రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఎంపిడిఓ ఇందిరమ్మకు, ఎంఇఒ మార్కండేయనాయుడుకు వినతిపత్రం అందజేశారు. పివిపురం మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

- కెవిబిపురం మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలల రద్దు నిరసిస్తూ ఎంఇఒ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల చదువుకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పాఠశాలలను రద్దు చేస్తూ సమీప పాఠశాలల్లో విలీనం చేయడం ఏంటని ప్రశ్నించారు. దీనివల్ల డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందన్నారు. మారుమూల గ్రామాలైన గురుకుల కండ్రిగ, వగత్తూరు, బంగారమ్మకండ్రిగ గ్రామాల విద్యార్థులు విద్యకు దూరమవుతారన్నారు. సిపిఎం ప్రాంతీయ కమిటి కార్యదర్శి నాగలాపురం నాగరాజు మాట్లాడుతూ ఉన్న గ్రామాల్లోనే స్కూళ్లను కొనసాగించని ఎడల పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. మణికంఠం వెంకటయ్య, రమణ పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం ఆపండి: సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటులో భాగంగా జిల్లాలో అందుకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయం వలన 580 ప్రాథమిక పాఠశాలలు విలీనం చేస్తున్నారని, ఇది అత్యంత హేయమైన చర్యగా అభివర్ణిస్తూ తక్షణమే ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక పత్రికా ప్రకటనలో కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో జిఓ నెంబర్ 117 ను తీసుకొచ్చి 3,4,5 వ తరగతులను హైస్కూల్స్‌లో విలీనం చేసారని, దీనికి సంబందించి ప్రభుత్వ పాఠశాల లకు తీవ్ర నష్టం జరుగుతుందని, తాము అధికారం లోకి వస్తే జిఓ నెంబర్ 117 ను రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు పేర్కొన్నారని గుర్తుచేశారు. కూటమి హయాంలో మెమో నెంబర్ ఈఎస్ఈ 02- 13021/4/2024 ను తీసుకొని వచ్చి రాష్ట్రం లోని సుమారు 33 వేల ప్రాథమిక పాఠశాలలను 28వేలకు పరిమితం చేస్తున్నారని, అందులో భాగంగా తిరుపతి జిల్లా లో 580 ప్రాథమిక పాఠశాలలు విలీనం చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి నిజంగా ప్రభుత్వ విద్యారంగంపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న పాఠశాలలు విలీనం చేయకుండా మోడల్ ప్రైమరీ పాఠశాల లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల దగ్గర విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు స్థానిక పాఠశాల ల దగ్గర ఆందోళన లు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం విలీనం నిర్ణయాన్ని విరమించుకోకపోతే జిల్లా, రాష్ట్ర కార్యాలయాల దగ్గర ఆందోళనలకు ప్రజలను సిపిఎం సమాయత్తం చేస్తుందని హెచ్చరించారు.

వెంకటగిరిలో ముగ్గురిపై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

వెంకటగిరి మండలంలోని పాలెంకోట అడవిలో రెండు ఎలుగుబంట్లు బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ముగ్గురిపై దాడి చేశాయి. ఈ ఎలుగుబంటి దాడిలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.. మొక్కలపాడుకు చెందిన కఠారి అంకయ్య, కావడి మునెయ్యతోపాటు మరో వ్యక్తి కొండ కింద ఈత కాయల కోసమని అడవికి వెళ్లగా ఈ ఘటన చోటు చేసుకున్నది. వారంతా తీవ్ర గాయాలతో వెంకటగిరి ప్రభుత్వ ఆప్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతికి తరలించారు.

ఎలుగుబంటి దాడిలో గాయాలు

21న తారకరామ స్టేడియంలో...
10వేల మందితో యోగా : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తిరుపతి తారకరామ స్టేడియం నందు సుమారు 10 వేల మందితో పెద్ద ఎత్తున యోగాను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు 21వ తేదీ జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రజలు. పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కావాలని ఎస్.పి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబందిత అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తారకరామ స్టేడియం నందు సుమారు 10 వేల మంది తో పెద్ద ఎత్తున యోగా

కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలని వివిధ శాఖలకు చెందిన అధికారులకు సూచించారు. మునిసిపల్ కార్పోరేషన్ వారు శానిటేషన్, తాగునీరు ఏర్పాటు, వైద్య ఆరోగ్య శాఖా వారు హెల్త్ క్యాంపు లు నిర్వహించాలని, జిల్లా పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రించాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు. పలు యునివర్సిటీల నుండి విద్యార్థులు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని వీసీలను ఆదేశించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, కళాశాలల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని విద్యా శాఖా వారిని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులు కూడా హాజరయ్యేల చూడాలని తెలిపారు. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను తూచా తప్పకుండ పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఉదయం 6 గంటలకల్లా అందరూ హాజరయ్యేలా చూడాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి మునిసిపల్ కమిషనర్ మౌర్య , డి.ఆర్.ఓ నరసింహులు , తిరుపతి ఆర్.డి.ఓ రామ్మోహన్, పలు యునివర్సిటీ ల వీసీలు, జిల్లా పంచాయతి అధకారి సుశీల దేవి, సాంఘిక సంక్షేమ అధికారి విక్రం కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖా అధికారి బాల కష్ణ నాయక్ పాల్గొన్నారు.

తోతాపురిని ప్రభుత్వ మద్దతు ధరకు కొనాల్సిందే

వ్యాపారులు సిండికేట్ అవ్వొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి రామచంద్రపురం (పాకాల)

మామిడి రైతన్నలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం దామల చెరువు మామిడికాయ మండి వ్యాపారస్తులతో, రైతులతో జిల్లా ఎస్పీ సమావేశమయ్యారు. ర్యాంపులను పరిశీలించారు. వ్యాపారస్తులతో, రైతులతో మాట్లాడారు. కొనుగోలు, అమ్మకాలను గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తోతాపూరి రకం మామిడి చివరి కాయ అమ్మే వరకు రైతులను రాష్ట్ర ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. రైతులు పక్కానికి వచ్చిన మామిడికాయలను కోసి తరలించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాపారస్తులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కచ్చితంగా కొని తీరాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, పాకాల సీ.ఐ సుదర్శన్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాకాల దామలచెరువు మండీలో ఎస్‌పి తనిఖీలు

అలిపిరి టోల్‌ప్లాజా పునరుద్ధరణ : టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆధునిక సౌకర్యాలతో అలిపిరి టోల్ ప్లాజా పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు టిటిడి ఈవో జె శ్యామల రావు తెలిపారు. తిరుపతి టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో అలిపిరి చెక్ పాయింట్ పునరుద్ధరణ, భద్రత పెంపుపై టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఈవో బుధవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా అలిపిరి టోల్ ప్లాజా వద్ద ఆధునిక సౌకర్యాలు, పటిష్ట భద్రత తదితర అంశాలపై జిఎంఆర్ గ్రూప్‌కు చెందిన రాక్సా సంస్థ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

భక్తుల చెకింగ్, లగేజీ స్కానింగ్‌కి ప్రస్తుతం తీసుకుంటున్న సమయం, దాని వల్ల వస్తున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. జీఎంఆర్ అనుబంధ సంస్థ అయిన రాక్సా సంస్థ ప్రతినిధులకు ఈవో సూచించారు. రాబోయే రెండు దశాబ్దాల పాటు భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక భద్రతా అంశాల ప్రతిపాదనలు సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాక్సా సీఈవో అమిత్ దార్, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సీవిఎస్వో మురళీ కష్ణ, సీఈ సత్యనారాయణ, ఈఈ వేణు గోపాల్, ఐటీ జీఎం శేషారెడ్డి, వీజీవోలు సదా లక్ష్మి, రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సైనిక చర్యకు విజయోత్సవ సూచికంగా రూపొందించిన విశ్లేషణాత్మక వ్యాసాల సంకలన పుస్తకాన్ని ఏబీఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ వై రామిరెడ్డి, రాష్ట్ర అకడమిక్ ఎడ్యుకేషన్ సెక్రటరీ డాక్టర్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం తిరుపతిలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల విద్యావేత్తలు ఈ దాడికి సంబంధించి తమ అభిప్రాయాలను విశ్లేషణాత్మక వ్యాసాల రూపంలో వ్యక్తీకరించారని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం తీసుకుంటున్న దృఢ వైఖరిని ఇందులో వివరంగా చర్చించారన్నారు. ఈ రచనలను సంకలనం చేసి, ప్రత్యేక గ్రంథంగా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పుస్తకం దేశభక్తిని పెంపొందించడమే కాక, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏర్పడిన ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

గంగమ్మ జాతరలో రోజా

పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండల ఎస్ వత్తి పుత్తూరులో ఘనంగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర మహోత్సవంలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. ఆమెకు మండల వైసిపి నాయకులు, సభ్యులు, స్థానిక గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ఆహ్వానించి గంగానీ సన్మానించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహశీల్దారుగా శ్రీదేవి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో ఇన్‌చార్జి తహశీల్దారుగా పనిచేస్తున్న శ్రీదేవిని ప్రభుత్వం రెగ్యులర్ తహశీల్దారుగా నియమించింది. ఈమె గతంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ కార్యాలయంలో ఈవోగా పనిచేస్తూ ఉండగా తాత్కాలిక బదిలీపై ఇన్‌చార్జి తహశీల్దారుగా మండలంలో ఎంతో కాలంగా పనిచేస్తున్న ఆమెను రెగ్యులర్ తహశీల్దారుగా నియమించటంతో ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. రైతులకు అందుబాటులో సేవలు అందిస్తానని ఆమె పేర్కొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న

- మయూరి శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. గూడూరు పట్టణం లోని గుమ్మడి పేట ఓం సాయి రాం బృందావనంలో మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్, హోమ్ బేకర్ కళ్యాణి , పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన తమిళ రైతులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని మిట్టూరు గ్రామంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం దత్తాత్రేయ పురుషోత్తం నాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని తమిళనాడు రాష్ట్ర రైతులు సందర్శించారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన తమిళనాడు రైతులు

తమిళనాడు కడలూరు జిల్లా ఆత్మ వారు నిర్వహించిన రెండురోజుల వ్యవసాయ విజ్ఞాన యాత్రలో భాగంగా 16 మంది రైతులు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీనివాసులు సమగ్ర వ్యవసాయ విధానంలో ఆహార, ఉద్యాన, పశుపోషణ మొదలైన అంశాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సాగుతో అధిక పంట దిగుబడి సాధించవచ్చని రైతులకు ఆదర్శ రైతు పురుషోత్తమనాయుడు వివరించారు. వివిధ అంశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే సిబ్బంది ప్రియాంక, ఆదర్శ రైతు పురుషోత్తమనాయుడు, ఆత్మ సిబ్బంది, తమిళనాడు రైతులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భగవాన్ రామచంద్ర స్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు , రొట్టెలు పంపిణీ చేశారు. 'కార్వేటి నగరం వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర స్వామి భక్త బృందం.ఉమాపతి, మాధవ రాజు, జయలక్ష్మి, నరేష్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ సూపరు వైజర్‌గా కె మనీలా

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్, రామచంద్రపురం మండలం రామచంద్రాపురం ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా కె మనీలా బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వడమాల పేట మండలం నుండి రామచంద్రాపురం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెకు అభినందనలు తెలిపారు.

యోగా భాగస్వామ్యం కావాలి: కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మనిషి దైనందిన జీవితంలో యోగ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక గాలి గోపురం వద్ద సుమారు 2 వేల మందితో యోగాంధ్ర పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆలయ ఈఓ బాపిరెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఆలయం లో ఈ నెల 27వ తేదీ నుంచి జూలై 9వ వరకు నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టరు ను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.

తూనికలు, కొలతలు శాఖాధికారుల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరులో తూనికలు, కొలతలు శాఖాధికారులు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వారి అసిస్టెంట్ గజేంద్రనాయుడు ఆధ్వర్యంలో బుధవారం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని దుకాణాల్లో వున్న త్రాసులను పరిశీలించి కొలతలు సరి చేసి సీల్ వేస్తున్నామన్నారు. గత రెండు రోజులుగా సుమారు 150 దుకాణాల్లో త్రాసులు పరిశీలించి కొలతల్లో తేడాలు వున్న త్రాసులను సరిచేసి దుకాణదారులకు తగు సూచనలు చేశామన్నారు. వచ్చే శనివారం వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయక అధికారులు గజేంద్ర నాయుడు, గణేష్ పాత్రో, రమేష్ బాబు, మురళి పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన తర్వాతే కాయలు కోయాలి

మామిడి రైతులకు ఉద్యాన శాఖ అధికారిణి సూచన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మామిడి రైతులు పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే చెట్ల నుండి కోయాలని తర్వాత మాత్రమే కోయాలని, అలా పక్వానికి రాని మామిడి పక్వా నీకు రాకముందు మామిడికాయలు కోయకూడదని వ్యవసాయాధికారి షణ్ముగం, ఉద్యాన శాఖ అధికారిణి శారద రైతులకు సూచించారు. మండలంలోని మామిడి రైతులందరికీ అగ్రికల్చర్ అధికారి షణ్ముగం ఉద్యాన శాఖ అధికారిణి రైతుసేవా కేంద్రంలో బుధవారం కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ మామిడి రైతులు కాయ పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోయాలని సూచించారు. అలా రాకముందు మామిడి కాయలు కోయకూడదని పేర్కొన్నారు. రైతులు గిట్టుబాటు ధర లేదని నష్టపోతామని ఆందోళన చెందవద్దని చివరి మామిడికాయ వరకు ప్రభుత్వం కిలోకి 4 రూపాయలు చెల్లిస్తుందన్నారు. రైతులెవరికీ ఎలాంటి నష్టం వాటి ల్లదని తెలిపారు. మామిడికాయల లోడ్ తో పాటుగా రైతుకు సంబంధించిన ఆధార్ కార్డ్, భూమి1బి, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలను అక్కడ ఉన్న సిబ్బందికి అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ర్యాంపులు, మండీలు, కలెక్షన్స్ సెంటర్ల వద్ద కూడా రైతులకు సంబంధించి పూర్తి వివరాలు ఒక కాపీ అక్కడున్న సిబ్బందికి అందించాలన్నారు. గుజ్జు పరిశ్రమల సామర్థ్యం మేర కొనుగోలు చేస్తుందని రోజువారీ ఈ వివరాలను జిల్లా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 0877-2236007కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకొని కాయల్ని తెలాలని సూచించారు. ప్రతి మామిడి రైతు ఈ విషయాలు జాగ్రత్తగా చూసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పేర్కొన్నారు.

29న భవన నిర్మాణ సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

- అధ్యక్షులు ఎస్‌డిరఫీ పిలుపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతిలో జూన్ 29వ తేదీ నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. యూనియన్ స్థాపించి 28 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘానికి సంబంధించిన 'పనిముట్లు చిత్రపటానికి' ఆ సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, రెండవ పట్టణ అధ్యక్షులు ఏ బాబు చేతుల మీదగా పూలమాలలు వేశారు. గూడూరులో బుధవారం సాయంత్రం దామవరపు శంకరమ్మ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహిస్తున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, ఎన్ నాగేంద్ర, జి మధు, సేలం శేఖరాచారి, వై బాబు, బండి కృష్ణయ్య, సిఐటియు ప్రధాన కార్యదర్శి బివిరమణయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ సంఘం నాయకులు

డివైఇఓ మహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు డివిజన్ విద్యాశాఖ అధికారిగా టి మహేశ్వరరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి డివైఈవోగా పనిచేస్తున్న ప్రభాకర్ రాజు ఉద్యోగ విరమణ చేశారు. అదే స్థానంలో వెదురు కుప్పం మండలంలో ఎంఈవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పుత్తూరు డివిజన్ విద్యాశాఖ అధికారిగా బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సంఘం నాయకులు స్వాగతం పలికి ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా డివైఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు మునెయ్య, ఉపాధ్యాయులు పా ల్గొన్నారు.

డివైఈవో మహేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెవిరెడ్డి కుటుంబానికి అండగా ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): చెవిరెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి అండగా వైసిపి అనుచరగణం బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించింది. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ముందున్న అంబేద్కర్ విగ్రహం వద్ద 'ఉయ్ సపోర్టు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి' అంటూ నినాదాలు చేశారు. చెవిరెడ్డి అక్రమ అరెస్టును సంఘటితంగా ఎదుర్కొంటామని, అరెస్టులతో భయ పెట్టలేరన్నారు. కార్యకర్తలు చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మికి, తల్లి మునిరత్నమ్మలకు ధైర్యం చెప్పారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని పరిషత్ ప్రాథమిక పాఠశాల బొజ్జనెత్తంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు ఎ కేశవులు నిండ్రకు బదిలీ అయ్యాడు. ఆయనకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ కేశవులు పాఠశాల అభివృద్ధి కోసం చాలా కృషి చేశారని, నమోదు బాగా పెంచారని, పిల్లలకు మంచి విద్యా బోధన చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, రాచపాలెం ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ , తల్లి దండ్రులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

'తల్లికి వందనం' మున్సిపల్ కార్మికులకూ ఇవ్వాలి

ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్, గూడూరు టౌన్: 'తల్లికి వందనం రూ.15వేలు మున్సిపల్ కార్మికులకూ ఇవ్వాలి' అని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు వెంకటగిరి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ అత్యంత తక్కువ వేతనాలు తీసుకుంటున్న కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయకపోవడం అన్యాయం అన్నారు. ఎన్నికలకు ముందు టిడిపి కూటమి ప్రభుత్వం 25వేల లోపు వేతనం తీసుకునే అందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక ఆదాయ పరిమితి విధించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జీవో నంబర్ 26 ప్రకారం తల్లికి వందనం పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. 19న బైక్‌ర్యాలీ, 23న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. 'తల్లికి వందనం' తల్లుల ఖాతాలో పడే వరకూ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ వి పెంచలయ్య, అధ్యక్షులు సుబ్బయ్య, కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పి రమణయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో... పట్టణ కార్యదర్శి ధారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా తల్లికి వందనం అమలు చేస్తామని జీవోలో పేర్కొని, కూటమి ప్రభుత్వం వేయకుండా అన్యాయం చేసిందన్నారు. జోగి శివకుమార్, బివి రమణయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, భూలోక మురళి, మణి, మణెమ్మ, కె.నారాయణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -కోట : ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్న ఐసిడిఎస్ అధికారులు సూపర్ వైజర్ కవిత సూచనల మేరకు మండలం గూడలి గిరిజన కాలనీ దక్షణపాలెం ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు చెన్నూరు కొటేశ్వరి, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం పూర్తి చేసుకున్న ఐదేళ్ల పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో గ్రేడ్లు ప్రకటించి గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా టీచర్ కోటేశ్వరి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అంగన్‌వాడీ సెంటర్లలో ప్లే స్కూల్ విద్యను అందిస్తున్నారని,పేద, సామాన్య ప్రజలు అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్స్‌ని సద్వినియోగం చేసుకోవాలని లక్షలాది రూపాయలు వెచ్చించి అప్పుల పాలు కావద్దని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

ఏర్పేడు: నూతనంగా ప్రవేశం పొందిన అంగన్‌వాడీ పిల్లలకు బుధవారం అంజిమేడు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ స్వర్ణలత పిల్లల తల్లిదండ్రులను పిలిపించి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శిరీష మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేందానికి క్రమంగా పంపి ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, ప్రగతి సిబ్బంది మురుగయ్య, వెంకటేశు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కలివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవల ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీ అయిన వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి అధ్యక్షతన ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలు పాటు పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులైన రూపేష్ కుమార్, నాదెండ్ల మురళి, ఒబ్బు ప్రసాద్, వేణుగోపాల్, దేవేంద్ర లకు బదిలీ వీడ్కోలు సందర్భంగా జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో పనిచేసిన అనుభవాలు, జ్ఞాపకాలు, పిల్లలతో గడిపిన క్షణాలను నెమరువేసుకోగా, ఇతర ఉపాధ్యాయులతో కలిసి పనిచేసిన తీరుని గుర్తు చేసుకుంటూ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, లక్ష్మయ్య, జగన్నాధం, దాసు, మాధవీలత, సుజన, మురళీ ప్రసాద్, దీపిక పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసానికి విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. నియోజకవర్గం వ్యాప్తంగా తల్లి దండ్రులు, నూతనంగా విద్యాభ్యాసం చేసే చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ప్రతి ఏటా సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్నామని ఆది దంపతుల సమక్షంలో చిన్నారులు విద్యాభ్యాసం చేయడం వారి పూర్వజన్మ సుకృతమని అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కొనియాడారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారి సత్రం మండలం వేణుంభాకం గ్రామానికి చెందిన వైసిపి మౌలాబాయ్‌ని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం పరామర్శించారు. ఇటీవల మౌలాబాయ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య బుధవారం నాయకులతో కలిసి వేణుభాకంలోని మౌలాబాయ్ నివాసానికి చేరుకుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవోదయ హైస్కూల్ ఈశ్వరవాక పద్మనాభరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మునస్వామినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి, నాయకులు నెలబల్లి సురేష్ రెడ్డి, జాల రాజగోపాల్ పాల్గొన్నారు.

వైసిపి నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రైతులకు అవగాహన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: 'పొలం పిలుస్తోంది'లో భాగంగా మండలంలోని పల్లమాల, పార్లపల్లి గ్రామాలలో బుధవారం ఉదయం రైతులకు వ్యవసాయ సాగుపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది రైతులు డ్రం సీడ్ పద్ధతిలో వరి నాట్లు వేశారని, ఈ పొలాల్లో కలుపు నివారణకు సంబంధించి తగు సలహాలు, సూచనలు అందించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి మండలంలోని రైతులు ఈ కేవైసీ పెండింగ్ ఉన్న రైతులకు ఈ కేవైసీ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేవతి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ కె షణ్ముగం పాల్గొన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న అధికారులు

నాయుడుపేట: వరి సాగులో నల్లి నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడిఏ నాగార్జునసాగర్ సూచించారు. నాయుడుపేట మండలంలోని అన్నమేడు, పుదూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ నాగార్జున సాగర్ వరి సాగులో నల్లి నివారణకు తీసువలసిన జాగ్రత్తలు వివరించారు. నల్లి సోకిన వరి పైరు ఆకులు తెల్లగా మారిపోయి ఆకులు పైన తెల్లటి చుక్కలు ఏర్పడుతాయని తెలిపారు. దీని నివారణకు ఓబెరాన్,ఓమిటీ, ప్రొఫైనోఫోస్ వంటి మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి గణేష్, రైతులు పాల్గొన్నారు.

పంట సాగుపై సలహాలు, సూచనలు ఇస్తున్న అధికారులు

మండల టిడిపి అధ్యక్షులుగా గణపర్తి కిషోర్ నాయుడు

గణపర్తి కిషోర్‌నాయుడును అభినందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -చిట్టమూరు: టిడిపి చిట్టమూరు మండల అధ్యక్షులుగా గణపర్తి కిషోర్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ పరిశీలకులు ఈశ్వరవాక శివ కోటారెడ్డి, షేక్ జమీర్ భాషాల ఆధ్వర్యంలో చిట్టమూరు ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంస్థాగత ఎన్నికల్లో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఆ పార్టీ మండల అధ్యక్షులుగా గణపర్తి కిషోర్ నాయుడు సమర్ధతను బలపరచడంతో వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రామిశెట్టి హరినాథ్, ప్రధాన కార్యదర్శు లుగా గుంపర్ల చిన్నారావు, కేతిరెడ్డి మోహన్ రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శులుగా ఆరూరు గిరిబాబు నాయుడు, పల్లం సునీత, మండల కార్యదర్శులుగా కే శ్రీనివాసులు రెడ్డి, అంబటి సునీత, మాలపాటి అభిషేక్, కోశాధికారిగా సన్నారెడ్డి మనోజ్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికైన మండల అధ్యక్షులు కిషోర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి చిన్నారావు, కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో పలువురు ఘనంగా సన్మానించారు. గణపర్తి కిషోర్ నాయుడు మాట్లాడుతూ మండలంలోని ప్రజల కు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అండగా వుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఐఎఫ్ విద్యార్థుల అద్భుత ఫలితాలు

- డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం
- 136 మంది పదోతరగతి పూర్తి చేశారు
- డీఐఎఫ్ వ్యవస్థాపకులు బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ తరపున పట్టణంలోని వివిధ ప్రయివేటు స్కూళ్లలో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించారని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. గూడూరు సొసైటీలోని ఆయన నివాసంలో పది ఉత్తీర్ణులైన విద్యార్థులతో బుధవారం కాసేపు ముచ్చటించారు. విద్యార్థుల కుటుంబ స్థితిగతులను తల్లిదండ్రులను వేర్వేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2008లో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ను స్థాపించామన్నారు. ఫౌండేషన్ విద్యార్థుల ఫీజు ఖర్చులతో పాటు పుస్తకాలు, యూనిఫాం అందిస్తోందన్నారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిరుపేద పిల్లలను చదివిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 136 మంది విద్యార్థులు పదవ తరగతి పూర్తి చేశారని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులు పదో తరగతిలో అద్భుతమైన ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ విద్యార్థులు 85 శాతం నుండి 97 శాతం వరకు మార్కులు సాధించారని తెలిపారు. ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ తమ విద్యార్థులకు ఒక అద్భుతమైన వరం అన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో చదివించే స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తున్న క్రమంలో నిరుపేద విద్యార్థుల చదువులకు మేమున్నామంటూ ముందుకొచ్చి ప్రయివేటు పాఠశాలల్లో చదివించారని కొరారు. అన్నదానం, రక్తదానం కంటే విలువైన దానం విద్యాదానమన్నారు. డ్రీమ్ ఇండియా ఫౌండేషన్‌కు రుణపడ్డామన్నారు. ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రోటరీ ఫాస్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పదోతరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, తొట్టంబేడు: ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన ఓ యువకుడికి చిత్తూరు పోక్సో ప్రత్యేక న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, రూ.6,500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చింది. తొట్టంబేడు పోలీసు స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు..తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి గ్రామానికి చెందిన ఓ ఆరేళ్ల బాలికకు తినుబండారాలు ఇప్పిస్తానని అదే గ్రామానికి చెందిన మునికార్తీక్(17) నమ్మబలికి ఎవరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లాడు. బాలికపై అత్యాచారయత్నం చేయగా కేకలు వేయడంతో విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ సంఘటనను గమనించిన మరో బాలిక బాధిత బాలిక తల్లిదండ్రులకు జరిగిన సంఘటనను తెలపడంతో విషయం బయటపడింది. దీనిపై వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు అతనిపై 2023 జనవరిలో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.

పారిశుధ్య కార్మికులకు వస్తువులు పంపిణీ

సోపులు, కొబ్బరి నూనె పంపిణీ చేస్తున్న దాత

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్: వెంకటగిరి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 110 మందికి రిటైర్డ్ ప్రధానోపా ధ్యాయులు పులిగోటి సుబ్రహ్మణ్యం తన సొంత నిధులతో కొబ్బరి నూనె డబ్బా , సంతూర్ సోపులు బుధవారం పంపిణీ చేశారు. కరోనా సమయంలో పలు రకాల సహాయ సహకారాలు అందించారు. వీరు పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారని వారిని అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పులిగోటి సుబ్రహ్మణ్యం ని పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సోపులు ఇవ్వాలని కోరిన వెంటనే ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పులుగోటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వస్తువులు ఇవ్వడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో పులిగోటి శశిధర్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

15 స్కూలు బస్సులు సీజ్ : ఆర్‌టీవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పాఠశాల, కళాశాల యాజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. పాఠశాలలు మళ్లీ ప్రారంభం కావడంతో జిల్లా పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన స్కూల్ బస్సులు, వ్యాన్ ల రికార్డులను స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేపట్టారు. బుధవారం కరకంబాడి కూడలి, రామానుజ పల్లి జంక్షన్, రేణిగుంట రోడ్డు, తిరుచానూరు రోడ్డు మార్గాలలో స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పాఠశాల, కళాశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు.విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండాలని గతంలోనే ఆయా కళాశాలలు, పాఠశాల యాజమాన్యాలకు తెలిపినా నిర్లక్ష్యంగా కొంతమంది వ్యవహరించారన్నారు. సీజ్ చేసిన 15 వాహనాలలో సామర్థ్య ధ్రువీకరణ పత్రం (ఎఫ్ సి), త్రైమాసిక పన్నులు చెల్లించని, అగ్నిమాపక పరికరాలు లేనివి, లైసెన్సు లేక వాహనం నడిపిన కారణాల చేత రూ.2 లక్షల రూపాయలు అపరాధ రుసుము విధించామని ఆర్టీఓ మురళి మోహన్ తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీలలో ఎంవిఐలు వనం వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికా నాజ్, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, రమణ నాయక్ పాల్గొన్నారు.

70 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ అటానమస్ కాలేజీ, టిటిడి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 70 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు అవసరం అని, కెరీర్‌ను సుస్థిరంగా కొనసాగించేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జగతి నెట్‌వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిందన్నారు. ఈ డ్రైవ్‌లో టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మసీ, హోండా, ఫ్లిప్‌కార్డ్, అమెజాన్, బ్లింక్ ఇట్ సంస్థలు పాల్గొన్నాయని, 300 మంది విద్యార్థులు హాజరు కాగా 70 మందికి ఉద్యోగావకాశం లభించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగతినెట్‌వర్కు ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జే.వాసుదేవనాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.భరత్‌కృష్ణ పాల్గొన్నారు.

'శ్రీ సాయి సుధా'లో ఉచిత బిఎండి పరీక్షలు

బిఎండి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు సుకుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత బిఎండి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ఎముకలు, కీళ్లు నరముల వైద్య నిపుణులు డాక్టర్ బి. సుకుమార్ ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ ముంబయి సహకారంతో ఉచిత పరీక్షలు చేయడంతో పాటు సలహాలు. సూచనలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని, ఎముకల సాంద్రత పరీక్షలు ప్రతి 3 నెలలకు ఒకసారి ఎముకల వైద్యుల్ని కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు.ఎక్సరే బోన్ డెన్సిటీ టెస్ట్ పరీక్షలతో ఎముకల సాంద్రతను తెలుసుకొని క్యాల్షియం పరిమాణాన్ని సాధ్యమైనంతవరకు ఆహారం ద్వారానే భర్తీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుబ్బా నాయుడు, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపీ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE - SRIKALAHASTI
E.A. NO. 52/2025, E.P. NO. 04/2020
O.S.NO. 84/2019

K.Srinivasulu ...Petitioner/Third Party (Claimant)
V/s
1)Adavaram. Raja Kumar ..D.Hr/Respondent
2)Punnapu. Madhusudhan Reddy ...J.Dr/Respondent

Summons/Notices to Respondent/ J.D.R No. 2

Punnapu. Madhusudhan Reddy
S/o P. Panduranga Reddy, R/o 1-326 Chennai Road Srikalahasti Town, Tirupathi Dist.

Please take notice/E.Pthat the abovecase is posted on 25th June 2025 for your appearance. you are requested to appear before the above Hon'ble Court on **25th June 2025** by to 10.30 A.M. either in person or through your advocate or otherwise the matter will be decided in your absence and you will be set exparte.

E.P SCHEDULE PROPERTY:

1st Item - part 5: Sri Balaji Rigistration of Tirupathi District- Buchi Naidu kandriga mandal- kalli vettu Village lands - wet lands Servey Number 202/6A To an extent of 0.16 cents Bounded on **East:** channel, **South & North:** Lands of Narayana Reddy, **West:** Third party lands

PERALA JAYACHANDRA
Advocate- Tirupati

ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు

పిఎస్ఎన్‌లో ఉచిత అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : తమిళనాడులోని తిరునల్వేలి లోనున్న పిఎస్ఎన్ గ్రూప్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ ఇంజనీరింగ్ కళాశాలలో తమ కళాశాల నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో ఉత్తీర్ణత సాధించిన 50 మంది ఆంధ్ర విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఆ కళాశాల వైస్ చైర్మన్ మారియప్పన్ తెలిపారు. బుధవారం తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని సీకాం కళాశాలకు ఎదురుగా సెమినార్ ప్రదేశంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని తిరునల్వేలిలో గత 26 సంవత్సరాలుగా అత్యున్నత విద్యా ప్రమాణాలతో వివిధ ఇంజనీరింగ్ కోర్సులలో శిక్షణ కల్పిస్తూ విద్యార్థులు ఉన్నతికి దోహదపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్ర విద్యార్థులకు తమ కళాశాలలో చదువుకునే సువర్ణ అవకాశాన్ని కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ తో పాటు తమ కంపెనీలచే క్యాంపస్ ఎన్రోల్ నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగం ఒకసారి కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో బిఈ బీటెక్ బి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్. బి రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ అండ్ ఆధార్ కోర్సుల లో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆంధ్ర విద్యార్థులకు ఉన్నతి విద్య చదువుకునే అవకాశం కల్పిస్తూ తిరుపతిలో సెమినార్ తో పాటు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంసెట్ పాస్. ఫీల్ అయిన విద్యార్థులకు ఉచితంగా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించి ఇందులో 14 మార్కులు సాధించిన వారికి తమ కళాశాలలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామన్నారు. తాము నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో ప్రతిభ చాటిన తొలి 50 మంది విద్యార్థులకు తమ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్ అవకాశాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని తమ బంగారు భవితను తీర్చిదిద్దుకోవాలని కోరారు. తిరుపతిలో తాము నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులు 8341359208ను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఎస్ఎన్ కళాశాల వైస్ చైర్మన్ మారియప్పన్

రైతులకు డ్రోన్లు పంపిణీ

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని చిన్న కనుపర్తి గ్రామంలో బుధవారం రైతులకు డ్రోన్లు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నివసిస్తున్న రైతులు సుభిక్షంగా ఉంటేనే ఆ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసల మధ్య రైతులు పంటలు పండించి ప్రతి ఒక్కరి ఆకలి తీరుస్తున్నారని తెలిపారు. ఇలాంటి రైతులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటామని అన్నారు. రైతులు పొలాల్లో రసాయన ఎరువులు పిచికారీ చేయడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనుంచి యాంత్రికరణ విధానంతో రసాయన ఎరువులు పిచికారీ చేయటానికి రైతులకు ప్రభుత్వం డ్రోన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, తొట్టంబేడు టిడిపి మండల అధ్యక్షుడు మునిరాజు నాయుడు, టిడిపి మాజీ మండలాధ్యక్షుడు గాలి మురళి నాయుడు, శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సురేంద్ర రెడ్డి, టిడిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

కనీస వేతనాలు చెల్లించాలి

మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తమకు కనీస వేతనాలను చెల్లించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది బుధవారం ఉదయం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి దర్గా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు, అనంతరం సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షులు ఏం శరవణ విలేకరులతో మాట్లాడుతూ తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘం గౌరవాధ్యక్షులు గంజి రామమూర్తి ఆదేశాల మేరకు నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బోర్ ఆపరేటర్లు, ప్లంబర్లు, ఫిట్టర్లు, స్ట్రీట్ లైట్ మెకానిక్స్, వాటర్ మెకానిక్స్, సెక్యూరిటీ గార్డులు, వాటర్ ట్యాంక్ డ్రైవర్లు, మున్సిపల్ పార్కుల సంరక్షకులు తదితర కేటగిరీలకు చెందిన తమకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.13,087 మాత్రమే జీతంగా చెల్లిస్తోందన్నారు. ఇది ఏమాత్రం సరిపోదని, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నెలకు కనీస వేతనంగా రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, అదే క్రమంలో మిగిలిన ఉద్యోగులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీంతో పాటు తమకు అమలు చేయకుండా నిలిపివేసిన ప్రభుత్వసంక్షేమ పథకాలైన తల్లికి వందనం, వితంతు పింఛన్లు, వికలాంగ పింఛన్లు తదితర లబ్ధిని తిరిగి వర్తింపజేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాగా ఈ కార్యక్రమంలో యూనియన్ డి శివకుమార్, పి వెంకటేష్, కె.ఆర్ శివప్రసాద్, గోపాల్ ఆచారి, ప్రభు, టి గోపాల్, సునీల్‌కుమార్, శంకర్ తో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి- రామచంద్రాపురం : మండలంలోని సొరకాయలపాళ్యం గ్రామం లో గంగజాతర వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం వేకువజామున గంగమ్మ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం రాత్రి చల్లకుండ, దున్నపోతును ఊరేగింపు చేశారు. అనంతరం బంక మట్టితో గంగమ్మ తల్లి ప్రతిమను ప్రతిష్ఠ చేశారు. బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు గంగ జాతరలో సందర్భంగా గంగమ్మ విగ్రహ నిమజ్జనం గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మకు మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, చేకూరి జనార్ధన్ చౌదరి లు పట్టు వస్త్రాలు సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధికార ప్రతినిధి చిన్న బాబు, చంద్రగిరి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పూజారి సుబ్రహ్మణ్యం, టిడిపి బీసీ సెల్ కార్యదర్శి మోహన్ యాదవ్, వినోద్ యాదవ్, కాయం చంద్రశేఖర్, ముని రామిరెడ్డి, ముని చంద్ర, నీలకంఠ చౌదరి, మధు, రంజిత్ రెడ్డి, చంగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న టిడిపి నాయకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాయుడుపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని మునిరత్నంనగర్‌లో నిర్వహించిన యోగ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు.

జ్యూస్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఫుడ్ అండ్ ఇన్స్ మామిడి ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని సందర్శించిన చిత్తూరు ఎస్పీ . మణికంఠ చందోలు బుధవారం ఫ్యాక్టరీలోని పలు విభాగాలను తనిఖీ చేసి, అక్కడి భద్రతా ఏర్పాట్లను, ఫ్యాక్టరీలో నిల్వ చేసే సామర్థ్యాన్ని సమీక్షించి, ఫ్యాక్టరీ యాజమాన్యంతో సమావేశమై ప్రాసెసింగ్ ,నిల్వ ప్రక్రియలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏడాది జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో మామిడి పండ్లను ఈ ఫ్యాక్టరీలోకి తీసుకువచ్చి నిల్వ చేసి ప్రాసెసింగ్ చేస్తున్నారు. దీంతో పాటు మామిడి రైతులు పెద్దఎత్తున తమ పంటను విక్రయించేందుకు ఇక్కడకు వస్తారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురవకుండా, ట్రాన్స్‌పోర్ట్ , నిల్వ వ్యవస్థ సజావుగా నడవాలన్న ఉద్దేశంతో ఎస్పీ స్వయంగా ఫ్యాక్టరీని సందర్శించారు. భద్రతాపరంగా ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న గోడ, గేట్లు, సీసీ కెమెరాలు, నైట్ గార్డుల విధులు తదితర అంశాలను ఎస్‌పి పరిశీలించి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం ఫైర్ సేఫ్టీ కిట్లు, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు ఉండాలన్నారు. రైతులు వచ్చేవేళ ట్రాఫిక్ నియంత్రణకు కావలసిన ఏర్పాట్లు ఉండేలా చూడాలని, పార్కింగ్ స్థలాలు కేటాయించి అవినీతికి అవకాశం లేకుండా వ్యవస్థలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసే సామర్థ్యం, ప్రాసెసింగ్ యూనిట్లు, రీప్యాకింగ్, ఎగుమతి చర్యల గురించి పూర్తి స్థాయిలో అధికారులతో కలిసి ఎస్పీ సమీక్షించారు. భద్రత పరంగా ఎలాంటి లోపం చోటు చేసుకోకుండా పోలీసు శాఖ తరపున అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం రైతులతో మాట్లాడుతూ ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఫ్యాక్టరీ నిల్వ సామర్థ్యాన్ని బట్టి రైతులను వారికి కేటాయించే క్రమంలో లోనికి అనుమతిస్తామని, కావున అందరూ సహనంతో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, గుడిపాల ఎస్ఐరామ్మోహన్, ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే

‘గుడ్ మార్నింగ్ నాయుడుపేట': ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నాయుడు పేట: సమస్యల పరిష్కారానికి మునిరత్నం నగర్ ప్రాంతంలో గుడ్ మార్నింగ్ నాయుడుపేట' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రతిగడపకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకునేందుకు గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట, గుడ్ మార్నింగ్ నాయుడుపేట కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో సైతం గుడ్ మార్నింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం సూళ్లూరుపేట లోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పొదుపు గ్రూపులోని ఆర్పీలకు ట్యాబ్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్,పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ, జనసేన సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, బిజెపి పట్టణ అధ్యక్షులు పి రాజశేఖర్ రెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, టిడిపి నాయకులు అవధానం సుధీర్, పలుకూరు ముత్యాలయ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, పలువురు నాయకులు పాల్గొన్నారు.